'పది' ఫలితాలకు ప్రణాళికలు: భద్రాద్రి కలెక్టర్

మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్

కొత్తగూడెం ఎడ్యుకేషన్, అక్టోబర్ 24: పదో తరగతి వార్షిక పరీక్షల్లో వంద శాతం ఫలితాలు సాధించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్ ఆదేశించారు. కొత్తగూడెంలోని విద్యా శిక్షణా కేంద్రంలో ఎంఈవోలు, కాంప్లెక్స్, ఉన్నత పాఠశాలల హెచ్ఎంలతో గురువారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులలో విద్యా సామర్థ్యాలు పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన కొరకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని, అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా అభివృద్ధి పనులు వేగవంతం చేస్తున్నట్లు చెప్పారు. పాఠశాలల్లో పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టేందుకు నిధులు విడుదల చేశామని, వాటిని పాఠశాల పరిశుభ్రత, వస్తువుల కొనుగోలుకు మాత్రమే వినియోగించాలన్నారు. అలాగే పాఠశాలల్లో త్వరలోనే 'పాఠశాల–వ్యవసాయం' అనే కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని, దీనికి ఉపాధ్యాయులు సహకరించాలని ఆయన కోరారు. సమావేశంలో డీఈవో వెంకటేశ్వరాచారి, అధికారులు మాధవరావు, నాగరాజశేఖర్, చలపతిరాజు, డాక్టర్ ఎం.ప్రభుదయాల్ పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు ప్రాధాన్యం

మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని

చుంచుపల్లి, అక్టోబర్ 24: గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు ప్రాధాన్యమిస్తున్నట్లు ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు చెప్పారు. మండలంలోని నందాతండా పంచాయతీ హౌసింగ్ బోర్డ్ కాలనీలో రూ.33 లక్షల అంచనా వ్యయంతో వాటర్ ట్యాంకుకు గురువారం శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ.. నందాతండా, బృందావనం ప్రజల దాహార్తి తీర్చేందుకు ఈ ట్యాంక్ నిర్మిస్తున్నట్లు చెప్పారు. మిగిలిన గ్రామాలతోపాటు పాల్వంచ, కొత్తగూడెం పట్టణాల్లోని మేజర్, మినీ నీటి పథకాలను పూర్తి స్థాయిలో ప్రజలకు అందుబాటులోకి తెస్తామన్నారు. ఎంపీడీవో అశోక్‌కుమార్, తహసీల్దార్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కొత్త బస్సులు ఇవ్వండి..

ఇల్లెందు ఆర్టీసీ డిపో ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా

ఇల్లెందు ఆర్టీసీ డిపో ఎదుట ధర్నా నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

ఇల్లెందు, అక్టోబర్ 24: డిపోలో ప్రస్తుతం ఉన్న బస్సులన్నీ కాలం చెల్లినవేనని, వెంటనే కొత్త బస్సులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేయాలని సీపీఎం ఆధ్వర్యంలో నాయకులు ఇల్లెందు ఆర్టీసీ డిపో ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ డిపో సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. అనంతరం సీపీఎం నాయకుడు అబ్దుల్ నబి మాట్లాడుతూ ఇల్లెందులో ఆర్టీసీ డిపో ఏర్పాటు చేసినా.. అన్నీ పాత బస్సులనే కేటాయించారన్నారు. డిపోలో డీజిల్ బంకు లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. అలాగే సిబ్బందికి రెస్ట్ రూములు, సైకిల్ స్టాండ్ ఏర్పాటు చేయాలని, మారుమూల ప్రాంతాలకు బస్సు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తాళ్లూరి కృష్ణ, ఆలేటి కిరణ్‌కుమార్, మన్యం మోహన్‌రావు, మునిగంటి లక్ష్మి, వాసం రాము, తాళ్లూరి పద్మ, యాకూబ్ పాషా, హుస్సేన్, వైకుంఠం, జయరాజు, సుజాత తదితరులు పాల్గొన్నారు.

'వెదురు'తో రక్షణ, 'మునగ'తో ఆరోగ్యం

వీడియో కాన్ఫరెన్స్‌లో రైతులకు అవగాహన కల్పించిన కలెక్టర్ జితేశ్ వి పాటిల్

వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు అవగాహన కల్పిస్తున్న కలెక్టర్

దమ్మపేట రూరల్, అక్టోబర్ 24: లాభసాటైన వెదురు, మునగ పంటలను రైతులు సాగు చేయాలని కలెక్టర్ జితేశ్ వి పాటిల్ కోరారు. ఆయన గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండలంలోని నాగుపల్లి రైతు వేదికలో రైతులతో మాట్లాడారు. గిరిజన ప్రాంత వాసుల్లో ఎక్కువగా రక్తహీనత సమస్య కనపడుతున్నదని అన్నారు. మునగ ఆకు, మునగ ఉప ఉత్పత్తులను భుజించడం ద్వారా రక్తహీనత నుంచి బయటపడవచ్చని చెప్పారు. పంటలకు రక్షణ కోసం వెదురును బయో ఫెన్సింగ్‌గా వాడుకోవచ్చని చెప్పారు. ఈ రెండు పంటలకు ప్రాధాన్యత ఉందని, వీటి సాగు లాభదాయకంగా ఉంటుందని అన్నారు. అశ్వారావుపేట ఏడీఏ రవికుమార్, ఎంపీడీవో రవీంద్రరెడ్డి, ఏవో చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మునగ సాగుపై దృష్టి సారించాలి

అన్నపురెడ్డిపల్లి, అక్టోబర్ 24: అధిక లాభాలనిచ్చే మునగ సాగుపై రైతులు దృష్టి సారించాలని ఎంపీడీవో మహాలక్ష్మి అన్నారు. మండలంలోని జానకీపురంలో రైతులతో ఆమె గురువారం సమావేశమయ్యారు. మునగ సాగుపై అవగాహన కల్పించారు. మునగ సాగు చేసే సన్న, చిన్న కారు రైతులకు ఉపాధి హామీ పథకం కింద ప్రభుత్వం మొక్కలతోపాటు ఖర్చులకు కూడా సాగం అందిస్తుందని చెప్పారు. ఆసక్తిగల రైతులు తమ వివరాలు తెలపాలని కోరారు. ఏవో అనూష, ఏపీవో ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన

పాల్వంచ రూరల్, అక్టోబర్ 24: మునగ సాగుపై మండలంలోని తోగ్గూడెంలో రైతులకు గురువారం అవగాహన కార్యక్రమాన్ని ఎంపీడీవో విజయభాస్కర్ రెడ్డి నిర్వహించారు. నిర్వహించారు. మునగ సాగుతో లాభాలు, ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీ వివరాలు తదితరాలను వివరించారు. ఎంపీవో నారాయణ, ఏపీఎం రాంబాబు, పంచాయతీ కార్యదర్శి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

భద్రాద్రి ఆలయంలో అంతర్గత రగడ

వైదిక కమిటీకి.. ఆలయ అధికారులకు మధ్య కుదరని సయోధ్య

ఇరువర్గాల మధ్య రగులుతున్న అంతర్గత పోరు

శబరి స్మృతి యాత్ర రోజు మూతపడిన ఉప ఆలయాలు

భద్రాచలం, అక్టోబర్ 24: భద్రాచలం పుణ్యక్షేత్రంలో కొంతకాలంగా ఇరువర్గాల మధ్య వర్గపోరు కొనసాగుతోంది. ఆలయ వైదిక కమిటీ మా మాట నెగ్గాలని, అధికారులు మా మాట నెగ్గాలని పోటీ పడుతున్నారు. ఒకరికొకరు వాద, ప్రతివాదాలకు దిగుతున్నారు. వారం రోజులుగా వివాదం ఇంకా పెద్దదిగా మారుతున్నట్లు కనిపిస్తోంది. దసరా ఉత్సవాల సమయంలో ఇద్దరు వైదిక పెద్దలు సెలవులు కోరగా ఆలయ అధికారులు ఇవ్వడం కుదరదని తెలిపారు. అయినప్పటికీ మాకు సెలవు కావాల్సిం దే అని పట్టుబట్టిన వైదిక పెద్దలకు సెలవు మంజూరు చేయక పోవడంతో విధులకు గైర్హాజరయ్యారు. దీంతో ఆలయ కార్యనిర్వహణాధికారి ఎల్.రమాదేవి ఇద్దరు వైదిక పెద్దలకు మెమోలు జారీ చేశారు. దీంతో అప్పటిదాకా తక్కువగా ఉన్న వివాదం పెరిగి పెద్దదిగా మారింది. తర్వాత శబరి స్మృతి యాత్ర ఉత్సవం ఘనంగా జరపాలని ఆలయ కమిటీ నిర్ణయించినప్పటికీ కొంతమంది అర్చక పరిచారులు కావాలంటూ వైదిక పెద్దలు కోరగా దానికి ఆలయ ఈవో అంగీకరించలేదని తెలుస్తోంది. శబరి స్మృతి యాత్ర ఉత్సవం నాడు ఆలయంలో పనిచేస్తున్న చాలామంది అర్చకులు అశ్వారావుపేట మండలం వినాయకపురం గ్రామానికి తరలివెళ్లారు. అక్కడే ఉత్సవాన్ని అంగరంగ వైభవంగా జరపడానికి సన్నాహాలు చేశారు. కానీ భద్రాద్రి ఆలయంలో అందరూ కదిలి వెళ్లడంతో అర్చకుల కొరత ఏర్పడింది. దీంతో ఉదయం నుంచి గంటల తరబడి భద్రాద్రి ఆలయంలోని ఆంజనేయ స్వామి ఆలయానికి, లక్ష్మీతాయారు అమ్మవారి ఆలయానికి తాళాలు వేయాల్సిన పరిస్థితి నెలకొన్నది. నిత్య దీపారాధనలు భక్తులకు దీవెనలు అందించే ఉపాలయాల్లోని ఆంజనేయస్వామి కార్యాలయాలు మూసివేసి ఉం చడం భక్తులను నిరాశపరిచింది. గిరిజనుల కొమ్ము నృ త్యాలతో వైభవంగా భద్రాచలంలో జరిగే శబరి స్మృతి యాత్ర గిరిజనులు లేక నీరుగారింది. పౌర్ణమి రోజు మం చి పర్వదినం రోజు ఆలయంలో ఇలా తలుపులు వేయ డం ఏమిటని భక్తులు బాహాటంగా చర్చించుకుంటున్నారు.

వ్యాస రచనలకు ఆహ్వానం

ఇల్లెందు, అక్టోబర్ 24: పోలీస్ అమరవీరుల జ్ఞాపకార్థం తెలుగు, ఉర్దూ, ఇంగ్లిష్‌లో విద్యార్థుల నుంచి వ్యాస రచనలను ఆహ్వానిస్తున్నట్లు ఇల్లెందు సీఐ బత్తుల సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. 8వ తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుతున్న విద్యార్థులు 'మొబైల్ ఫోన్ వాడకంలో విచక్షణ' అంశంపై, డిగ్రీ, ఆపైన చదువుతున్న విద్యార్థు లు 'తెలంగాణను మాదకద్రవ్య రహిత రాష్ట్రంగా మార్చడంలో నా పాత్ర' అంశంపై వ్యాసాలను ఈ నెల 27వ తేదీలోపు పంపాలని వివరించారు. విజేతలకు భాషలవారీగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు, మెమెంటోలు ప్రదానం చేస్తామన్నారు.

జేకే 5 గనికి ఫైవ్ స్టార్ రేటింగ్

మెమెంటోను చూపుతున్న ఏరియా జీఎం

ఇల్లెందు రూరల్, అక్టోబర్ 24: ఇల్లెందు ఏరియా జేకే 5 గనికి కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ నుంచి ఫైవ్ స్టార్ రేటింగ్ రావడంపై జీఎం జాన్ ఆనంద్ హర్షం వ్యక్తం చేశారు. జేకే 5 ఓసీలో గురువారం అభినందన సభలో ఆయన మాట్లాడుతూ.. దేశంలోని ప్రభుత్వ, ప్రైవేట్ రంగ బొగ్గు ఉత్పత్తి కంపెనీల్లో ప్రమాదరహిత గనులకు కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ ప్రతి ఏటా ఫైవ్ స్టార్ రేటింగ్ ఇస్తుందని చెప్పారు. ఈసారి ఇల్లెందు ఏరియాలోని జేకే 5 ఓసీ అవార్డును అందుకోవడం అభినందనీయమన్నారు. దేశ వ్యాప్తంగా కోలిండియా, సింగరేణి, ఇతర ప్రైవేట్ సంస్థలకు చెందిన 380 గనులు ఫైవ్ స్టార్ రేటింగ్ కోసం దరఖాస్తు చేశాయని చెప్పారు. ప్రమాదరహితంగా ఉన్న అత్యుత్తమ గనులను ప్రతి ఏటా కేంద్ర బొగ్గు శాఖ ఎంపిక చేస్తుందని, వాటిలోనూ అత్యంత మెరుగ్గా ఉన్న వాటికే ఫైవ్ స్టార్ రేటింగ్ ఇస్తుందని వివరించారు. జేకే 5 ఓసీకి ఫైవ్ స్టార్ రేటింగ్ రావడం గర్వంగా ఉందన్నారు. జేకే 5 ఓసీ ఉపరితల గని సూపర్‌వైజర్లు, అధికారులు, ఉద్యోగులు ఇదే ఒరవడిని కొనసాగించాలని పిలుపునిస్తూ, వారికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌వోటు జీఎం బొల్లం వెంకటేశ్వర్లు, డీజీఎం (పర్సనల్) జీవీ మోహన్ రావు, అధికారులు చిన్నయ్య, పులి పూర్ణచందర్, సుధాకర్, నాయకులు నజీర్ అహ్మద్, సంజీవాచారి, నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జేకే 5 ఉపరితల గని సందర్శన

వ్యూ పాయింట్ నుంచి చూస్తున్న ట్రైనీ అధికారులు

ఇల్లెందు రూరల్, అక్టోబర్ 24: ఇల్లెందు ఏరియా జేకే 5 ఉపరితల గనిని సివిల్ ట్రైనీ అధికారులు గురువారం సందర్శించారు. జేకే 5 ఓసీలో పని స్థలాలను వ్యూ పాయింట్ నుంచి వారికి ప్రాజెక్ట్ ఆఫీసర్ కృష్ణమోహన్ చూపించారు. ఓసీలో పనితీరును ట్రైనీ అధికారులు పరిశీలించారు. రోజువారీ ఉత్పత్తి, ఉత్పాదకతత, ఓబీ బ్లాస్టింగ్, లో డింగ్, రవాణా, పర్యావరణ పరిరక్షణ తదితరాంశాలను తెలుసుకున్నారు. అధికారులు తేజస్విని, విపుల్ సింఘాల్, అనిత మీనా, అల్తమష్ ఘాజి, నాగేశ్వరరావు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

ఇల్లెందు రూరల్, అక్టోబర్ 24: మండలంలోని తెలంగాణ మైనార్టీస్ రెసిడెన్షియల్ స్కూల్‌లో ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన ఉపాధ్యాయుల నియామకానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ భీమనపల్లి కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. టీజీటీ ఇంగ్లిష్–1, టీజీటీ సోషల్ స్టడీస్–1 పోస్టులు ఉ న్నాయని పేర్కొన్నారు. సంబంధిత సబ్జెక్టుల్లో డిగ్రీ, బీఈడీ, బోధనానుభవం ఉన్నవారు దరఖాస్తు చే సుకోవచ్చని వివరించారు. వయసు 18 నుంచి 44 సంవత్సరాల వరకు ఉండవచ్చని పేర్కొన్నారు. ఈ నెల 28న తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్, 24 ఏరియా, ఓల్డ్ ఎస్‌సీసీఎల్ బిల్డింగ్‌లో ఇంటర్వ్యూకు హాజరుకావాలని తెలిపారు. వివరాలకు 9515523864, 9110360408, 98661 40158 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

సీసీ రోడ్డు మంజూరు చేయాలి

భద్రాచలం, అక్టోబర్ 24: పట్టణంలోని జగదీష్‌కాలనీ 19వ వార్డులో మసీదు వెనుక సీసీ రోడ్డు మంజూరు చేయాలని బీఆర్ఎస్ నాయకులు ఆకోజు సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో వార్డు ప్రజలు గురువారం పంచాయతీ ఈవో శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఈవో కాలనీని పరిశీలించి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. వినతిపత్రం అందజేసిన వారిలో బీఆర్ఎస్ నాయకులు అయినాల రామకృష్ణ, కాలనీ మహిళలు కోట పాప, ఎస్‌కె.తస్లీమా, యన్నం సరోజిని ఉన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

చంద్రుగొండ, అక్టోబర్10: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాల మహానాడు చేపట్టనున్న పాదయాత్ర ప్రచార పోస్టర్‌ను జిల్లా అధ్యక్షుడు పూల రవీందర్ గురువారం స్థానిక అంబేద్కర్ కాలనీలో ఆవిష్కరించారు. పాదయాత్రను శ్రేణులు జయప్రదం చేయాలని కోరారు.

రామానుజవరం పంచాయతీలో వైద్య శిబిరం

మణుగూరు టౌన్, అక్టోబర్ 24: సింగరేణి మణుగూరు ఏరియా ఆధ్వర్యంలో రామానుజవరం పంచాయతీ కార్యాలయంలో గురువారం వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శిబిరంలో అవసరమైన వారికి సింగరేణి ఆస్పత్రిలో వైద్య సేవలు కల్పించాలని వారు కోరారు. కార్యక్రమంలో రామచంద్రయ్య, శ్రీకాంత్, పల్లపు వెంకటేశ్వర్లు, లేళ్ల ఉపేందర్, మల్లికంటి రాములు, సోడే సాయి, పంచాయతీ గుమస్తా రమేశ్ పాల్గొన్నారు.

ప్రకటన

ఇందుమూలముగా నాక్లయింటు అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, భద్రాచలం బ్రాంచ్ వారు ఇచ్చిన బొగట్టా ప్రకారం యావన్మందికి తెలుపునది. ఈ క్రింది షెడ్యూలు చూపిన స్థిరాస్తిని రిజిస్టర్ తనఖా చేయించుకొని **పసుపులేటి శ్రీరామ్ ప్రసాద్**,S/o. **వెంకటేశ్వరరావు, వయస్సు** :33సం||లు, **వృత్తి** : వ్యాపారం, నివాసం: ఇ.నెం. 13–4–198/6, కొర్రాజులగుట్ట, భద్రాచలం పట్టణము, భద్రాచలం మండలం, భద్రాద్రికొత్తగూడెం జిల్లా గారికి ఋణం ఇచ్చుటకు నిర్ణయించుకున్నారు.కావున సదరు వ్యవహారమునకు సంబంధించి సదరు షెడ్యూల్ స్థిరాస్తిపై ఎవరికైనను ఎటువంటి జప్తులు చార్జీలు, క్లెయిములు, తనఖాలు అగ్రిమెంట్లు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్నయెడల నేటి నుండి 3 రోజులలో ఈ క్రింద చూపిన చిరునామాకు వ్రాతపూర్వకముగా తెలియజేయగలరు. తదుపరి వచ్చు అభ్యంతరములకు నా క్లయింటు బాధ్యులు కారు.

షెడ్యూలు ఆస్తి : జిల్లా రిజిస్ట్రారు, ఖమ్మం, బూర్గంపహాడ్ సబ్ రిజిస్ట్రారు వారి పరిధిలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపహాడ్ మండలం, బూర్గంపహాడ్ శివారు, లక్ష్మీపురం గ్రామపంచాయితీ ఏరియాలో చేరిన బూర్గంపహాడ్ శివారు లక్ష్మీపురం గ్రామములోని 454/12/అ, 454/13/అ, 454/17/అ, 454/18/అ, **డాక్యుమెంట్ నెం: 01/2024**, ప్లాట్ నెం. 402లోని 100 చ||గ||లు స్థలమునకు సరిహద్దులు : (VLTNo./Assessment No.320220400203) **తూర్పు**:ప్లాట్ నెం.383, **పడమర**:ఇంటర్నల్ రోడ్, **ఉత్తరం**: ఇంటర్నల్ రోడ్, **దక్షిణము**: ప్లాట్ నెంబరు : 401.

పలివెల గణేష్ బాబు
అడ్వకేట్, కొత్తగూడెం.సెల్ : 9849246278

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds

PLOT FOR SALE

★గజం: 2,500/- నార్కెట్‌పల్లి దగ్గర గేటెడ్ కమ్యూనిటీ వెంచర్‌లో స్విమ్మింగ్ పూల్, కాటేజీ, 30 పండ్ల మొక్కలు, 30 ఎర్రచందనం మొక్కలతో 5 & 10 గుంటల ప్లాట్స్ అమ్మబడును. దసరా ఆఫర్ 10 గ్రా. గోల్డ్ కలదు. 7569587521.
NT-338783

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

విద్యార్థులకు ఫుడ్‌పాయిజన్ బాధాకరం: రేగా

మణుగూరు టౌన్, అక్టోబర్ 24: మండలంలోని మారుతీనగర్ ప్రాథమిక పాఠశాలలో ఫుడ్ పాయిజన్ అయి ఆరుగురు విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటన బాధాకరమని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు అన్నారు. గురువారం ఆయన మణుగూరులో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో విద్యాశాఖ మంత్రి లేక పోవడం సరైన మానిటరింగ్ చేయకపోవడం వల్లనే ఇలా జరుగుతోందన్నారు. విద్యార్థులకు సరైన విద్యాబోధన, మధ్యాహ్న భోజనం అందించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాలు ప్రతి నియోజకవర్గంలో ఏర్పాటు చేసి నాణ్యమైన విద్య, రుచికరమైన టిఫిన్, సన్నబియ్యంతో భోజనం అందించామని గుర్తు చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టి విద్యావ్యవస్థను గాడిలో పెట్టాలని డిమాండ్ చేశారు.

శేషగిరినగర్‌లో కార్డన్ సెర్చ్..

మాట్లాడుతున్న డీఎస్పీ రవీందర్‌రెడ్డి, సీఐ, ఎస్సైలు

మణుగూరు టౌన్, అక్టోబర్ 24: మున్సిపాలిటీ పరిధిలోని శేషగిరినగర్‌లో కమ్యూనిటీ కాంటాక్టు కార్డన్ సెర్చ్‌ను గురువారం ఉదయం నిర్వహించారు. ఈ తనిఖీల్లో డీఎస్పీ రవీందర్ రెడ్డి, సీఐ సతీష్‌కుమార్, ఎస్సైలు మేడ ప్రసాద్, రాజ్‌కుమార్, తిరుపతి, రవూఫ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ రవిందర్‌రెడ్డి మాట్లాడుతూ.. గంజాయి, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ప్రస్తుతం యువత గంజాయికి బానిస అవుతున్నారని, సైబర్ క్రైమ్ పట్ల మోసపోకుండా జాగ్రత్తగా ఉండాలని అన్నారు. ఈ కార్డన్ సెర్చ్‌లో ఏఎస్సై మోహన్, కానిస్టేబుల్ కోటి, రవీందర్, రామారావు పాల్గొన్నారు. ఈ తనిఖీల్లో 37 బైక్‌లు, రెండు ఆటోలు, ఒక కారును స్వాధీనం చేసుకున్నారు.

ఎంవీఐను కలిసిన టీఎన్‌జీవోస్ బాధ్యులు

భద్రాచలం, అక్టోబర్ 24: భద్రాచలం ఎంవీఐగా బాధ్యతలు చేపట్టిన సంగం వెంకటపుల్లయ్యను టీఎన్‌జీవోస్ అధ్యక్ష, కార్యదర్శులు డెక్కా నర్సింహారావు, గగ్గూరి బాలకృష్ణ ఆధ్వర్యంలో గురువారం రవాణా కార్యాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ట్రాఫిక్ దృష్ట్యా ప్రతిఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో ట్రెజరర్ పడిన నర్సింహారావు, గాంధీ, శ్రీనివాస్, అంజిబాబు, హరి, సత్యనారాయణ, రామకృష్ణ పాల్గొన్నారు

భద్రాద్రి రామయ్యకు నిత్యకల్యాణం

భద్రాచలం, అక్టోబరు 24: భద్రాచలం దివ్యక్షేత్రంలోని బేడా మండపంలో అర్చకులు గురువారం స్వామివారికి నిత్యకల్యాణం నిర్వహించారు. అర్చకులు తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి స్వామికి సుప్రభాతం పలికి ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, నిత్య హోమాలు, నిత్య బలిహరణ, నిత్యపూజలు జరిపారు. కల్యాణంలో పాల్గొన్న దాతలకు ప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేశారు.

పర్ణశాలలో పునర్వసు కల్యాణం

పునర్వసు కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

పర్ణశాల, అక్టోబర్ 24: పర్ణశాల దేవస్థానంలో గురువారం పునర్వ సు నక్షత్రం సందర్భంగా స్వామివారికి మాస కల్యాణం నిర్వహించా రు. అర్చకులు తొలుత స్వామివారికి విశేష తిరుమంజనం నిర్వహించి వైదిక కార్యక్రమాలను ఆచరించి స్వామివారికి కల్యాణం నిర్వహించారు. భక్తులు కల్యాణ మహోత్సవాలను తిలకించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ఇన్‌చార్జి అనీల్‌కుమార్, ప్రతాపురం భార్గవాచార్యులు, శేషం కిరణ్‌కుమార్ చార్యులు, భాస్కరాచార్యులు, నలదీగల నరసింహాచార్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దమ్మ గుడి ఆదాయం రూ.39,34,078

పాల్వంచ రూరల్, అక్టోబర్ 24: మండలంలోని పెద్దమ్మ గుడి ఆలయ హుండీ ఆదాయాన్ని ప్రాంగణంలోని కళావేదికలో సిబ్బంది గురువారం అధికారుల సమక్షంలో లెక్కించారు. ఈ ఏడాది జూన్ 13 నుంచి ఈ నెల 23వ తేదీ వరకు 132 రోజులకుగాను రూ. 39,34,078 ఆదాయం వచ్చింది. ఇంగ్లాండ్ డాలర్లు–5, ఖతార్ దీనార్–1, అమెరికన్ డాలర్లు–5, సౌదీ అరేబియా రియాల్స్–10 వచ్చాయి. దేవాదాయ ధర్మాదాయ శాఖ డివిజన్ పరిశీలకుడు బేల్ సింగ్, ఈవో రజనీకుమారి తదితరులు పాల్గొన్నారు. ఆలయంలో శాశ్వత అన్నదానానికి ఖమ్మం రోటరీ నగర్‌కు చెందిన మధు–యామిని దంపతులు రూ.1,11,116ను విరాళంగా అందించారు.

మెడిసిన్ సీటు సాధించిన రెజ్లర్

సిద్ధార్థను అభినందిస్తున్న జిల్లా క్రీడల అధికారి పరంధామరెడ్డి

కొత్తగూడెం టౌన్, అక్టోబర్ 24: కొత్తగూడేనికి చెందిన రెజ్లింగ్ క్రీడాకారుడు సిద్ధార్థ, నీట్‌లో 596 సాధించి, ఓపెన్ కేటగిరీలో జగిత్యాల మెడికల్ కాలేజీలో మెడిసిన్ సీటు సాధించారు. ఆయనను జిల్లా క్రీడాధికారి పరంధామరెడ్డి, జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కాశీ హుస్సేన్ తదితరులు అభినందించారు.

మెడిసిన్ విద్యార్థినులకు చెక్కుల అందజేత

విద్యార్థినిని అభినందించి చెక్కు అందజేస్తున్న పీవో రాహుల్

భద్రాచలం, అక్టోబర్ 24: గిరిజన సంక్షేమశాఖ గురుకులం పాఠశాల, కళాశాలల్లో చదివి అత్యుత్తమ ర్యాంకులు సాధించి ఎంబీబీఎస్ సీట్లు సాధించిన విద్యార్థినులను ఐటీడీఏ పీవో రాహుల్ గురువారం తన చాంబర్‌లో అభినందించి ఐటీడీఏ రిలీఫ్ ఫండ్ కింద ఒక్కొక్కరికి రూ.50 వేల చొప్పున చెక్కులను అందజేశారు. గుండాల మండలానికి చెందిన వజ్జా వీర కుమారి,ఏటూరు నాగారం మండలానికి చెందిన కుడుముల సాత్విక, వెంకటాపురం మండలానికి చెందిన పూనెం గీతాంజలి, గుండాలకు చెందిన ఇర్పా అమృత తరణి ఎంబీబీఎస్ సీట్లు దక్కించుకున్నారని, వారు వైద్యవృత్తిలో వైద్యసేవలు అందించాలని ఆకాంక్షించారు. ఏపీవో జనరల్ డేవిడ్‌రాజ్, సున్నం రాంబాబు, ఖమ్మం డీడీ విజయలక్ష్మి, ఆర్‌సీవో నాగార్జునరావు, ఏసీఎంవో రమణయ్య పాల్గొన్నారు.

రడం శ్రీనుకు నివాళి

ఇల్లెందు రూరల్, అక్టోబర్ 24: ఉద్యమకారుడు రడం శ్రీను సంతాప సభ గురువారం మండలంలోని కొమరారం గ్రామంలో జరిగింది. బీఆర్ఎస్ జిల్లా నాయకుడు దిండిగాల రాజేందర్, ఇల్లెందు మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ మడత వెంకట్‌గౌడ్ నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ.. ప్రజాకళాకారుడిగా, కష్టజీవిగా రడం శ్రీను పేరు సంపాదించినట్లు చెప్పారు. తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారని అన్నారు. ఈ సభలో రడం శ్రీనుకు ఎమ్మెల్యే కోరం కనకయ్య నివాళి అర్పించారు. సీపీఐ–ఎంఎల్ (న్యూ డెమోక్రసీ) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఆవునూరి మధు, పౌర హక్కుల సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, నాయకులు పాల్గొన్నారు.

మండల పశువైద్యాధికారిణిగా లిఖిత

దుమ్ముగూడెం, అక్టోబర్ 24: దుమ్ముగూడెం మండల పశువైద్యాధికారిగా లిఖిత గురువారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ ఇన్‌చార్జి పశువైద్యాధికారిగా బూర్గంపహాడ్‌కు చెందిన మోరపాక రవీందర్ విధులు నిర్వహించి పదోన్నతిపై వెళ్లారు.

ఎమ్మెల్యే జారే పర్యటన

అశ్వారావుపేట రూరల్/అశ్వారావుపేట టౌన్, అక్టోబర్ 24: మండలంలో గురువారం ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పర్యటించారు. సీఆర్ఆర్ఎఫ్, కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు వారి ఇళ్ల వద్ద చెక్కులు, అశ్వారావుపేట పంచాయతీ కార్యాలయంలో సెర్ప్ గ్రామ సంఘాల మహి ళా సభ్యులకు చీరలు పంపిణీ చేశారు. 26 సెర్ప్ సంఘాల సభ్యులకు రూ.4.24 కోట్లకు చెక్కు అందించారు. తహసీల్దార్ కృష్ణప్రసాద్, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఎంపీవో ప్రసాదరావు, మండల ప్రత్యేకాధికారి సందీప్ కుమార్, ఏపీఎం అవుల వెంకటేశ్వరరెడ్డి, మేనేజర్ రాజేశ్‌తదితరులు పాల్గొన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ

నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073

నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

వర్గీకరణకు వ్యతిరేకంగా పాదయాత్ర

టేకులపల్లి, అక్టోబర్ 24: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ ఈ నెల 25న భద్రాచలంలో, 27న సులానగర్‌లో పాదయాత్ర నిర్వహిస్తారని మండల అధ్యక్షుడు కర్లపూడి సుందర్‌పాల్ చెప్పారు. దీనిని జయప్రదం చేయాలని శ్రేణులను కోరారు. సులానగర్‌లో గురువారం సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రచార కరపత్రాన్ని ఆవిష్కరించారు.

ఇండ్లు, ఇంటి స్థలాలు ఇవ్వాలి

పాల్వంచ, అక్టోబర్ 24: పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు, ఇంటి స్థలాలు ఇవ్వాలని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన గురువారం గుడివాడ రామలక్ష్మణుల భవన్‌లో ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. తమ పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు.

పోలియోపై అవగాహన సదస్సు

కొత్తగూడెం అర్బన్, అక్టోబర్ 24: ప్రపంచ పోలియో నివారణ దినోత్సవం సందర్భంగా ఈ వ్యాధిపై కొత్తగూడెంలోని ప్రియదర్శిని డిగ్రీ, పీజీ కాలేజీ విద్యార్థులకు అవగాహన సదస్సును గురువారం రోటరీ క్లబ్ ఆఫ్ కొత్తగూడెం నిర్వహించింది. కళాశాల డైరెక్టర్ రామనేని చలపతిరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షురాలు సుజాత, ఉపాధ్యక్షులు ఉషారాణి, సావిత్రి, సిరిమల్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్లు, డ్రైన్లకు శంకుస్థాపన

పాల్వంచ, అక్టోబర్ 24: పట్టణంలోని చిన్నబంగారుజాల, గుడిపాడు, శ్రీనివాస్ కాలనీ, ఇందిరానగర్ కాలనీ, వనమా కాలనీ, కాంట్రాక్టర్స్ కాలనీలో సీసీ రోడ్లు, డ్రైన్లకు ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు గురువారం శంకుస్థాపన చేశారు. తహసీల్దార్ వివేక్, మున్సిపల్ కమిషనర్ ఢాకు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పరిహారం ఇవ్వాలని వినతి

అశ్వారావుపేట, అక్టోబర్ 24: అంకమ్మ చెరువు ప్రత్యామ్నాయ కాలువ నిర్మాణానికి భూములు ఇచ్చిన రైతులకు తక్షణమే పరిహారం చెల్లించాలని కోరుతూ ఆధార్ పార్టీ జిల్లా చైర్మన్ కంటే కేశవ్ గౌడ్ గురువారం తహసీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చారు. రూ.లక్షల విలువైన భూములకు కేవలం రూ. లక్ష మాత్రమే పరిహారం ఇవ్వడం న్యాయం కాదని పేర్కొన్నారు. ఎకరాకు రూ.8 లక్షల చొప్పున ఇవ్వాలని కోరారు.

చేప పిల్లలు పంపిణీ

అశ్వారావుపేట రూరల్, అక్టోబర్ 24: మండలంలోని 49 చెరువుల్లో వదిలేందుకు సంబంధిత బాధ్యులకు మొత్తం మూడులక్షల చేప పిల్లలను మత్స్య శాఖ జిల్లా అధికారి ఇంతియాజ్ అహ్మద్ గురువారం పంపిణీ చేశారు. మత్స్య శాఖ మండల ఇన్‌చార్జ్ మిడియం మంగరాజు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సీహెచ్‌పీలో సహపంక్తి భోజనాలు

ఇల్లెందు రూరల్, అక్టోబర్ 24: సింగరేణి ఇల్లెందు ఏరియా సీహెచ్‌పీ గని వద్ద గురువారం సహపంక్తి భోజనాలను జీఎం జాన్ ఆనంద్ ప్రారంభించారు. సీహెచ్‌పీ అధికారి క్రిష్టాఫర్, ఎస్‌వోటు జీఎం బొల్లం వెంకటేశ్వర్లు, డీజీఎం (పర్సనల్) జీవీ మోహన్‌రావు, వర్క్‌షాప్ డీజీఎం నాగరాజు నాయక్, ఇంజినీర్ పవన్, స్టోర్ ఇన్‌చార్జ్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో వైద్య శిబిరం

టేకులపల్లి, అక్టోబర్ 24: మండలంలోని బద్దుతండా ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌లో గురువారం వైద్య శిబిరాన్ని సులానగర్ పీహెచ్‌సీ డాక్టర్ దినేష్ నిర్వహించారు. సీజనల్ వ్యాధులు, పరిశుభ్రత, అయోడిన్ లోపంతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ నిశాంత్ కృష్ణ ,వైద్య సిబ్బంది దేవా, నాగుబండి వెంకటేశ్వర్లు, ధరణి, స్వప్న, భవాని, కవిత, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

'కక్షతోనే షాపు తొలగింపు'

పాల్వంచ, అక్టోబర్ 24: పాల్వంచలోని జామా మసీద్ ఎన్నికల్లో తాము సహకరించలేదన్న కక్షతోనే మసీద్ కాంప్లెక్స్‌లోని తమ ఎలక్ట్రానిక్ షాపును బాధ్యులు దౌర్జన్యంగా తొలగించారని ఫాతిమా, ఇర్ఫాన్ దంపతులు ఆరోపించారు. వారు గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. అద్దె చెల్లించలేదన్న సాకుతో షాపును తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు.